క్లుప్తంగా

రహదారి గుంతలమయం



గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి

లింగపాలెం: మండలంలోని లింగపాలెం-సింగగూడెం-కొత్తపల్లి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సింగగూడెం గ్రామంలో ఆర్అండ్బీ రోడ్డు గుంతలు పడి చిందర వందరగా తయారైంది. ప్రతి రోజూ ద్విచక్ర వాహనాల మీద వెళ్లేవారు కిందపడి గాయాలపాలవుతున్నారు. అర్బన్ ఆర్అండ్బీ వారు స్పందించి వెంటనే ఆ రోడ్డును పునర్నిర్మించాలని కోరుతున్నారు.

పేరంటాలమ్మకు పుష్పాలంకరణ



పేరంటాలమ్మ

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ 68వ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న భీమనాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దీవెనల పండుగ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఫాదర్లు, సంఘస్తులు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఈనెల 11, 12, 13, 14 తేదీల్లో దీవెనల పండుగలు నిర్వహించనున్నట్టు పాస్టర్ విలియమ్స్ తెలిపారు. గురువారం కొవ్వలి చర్చిలో ఆయన సంఘస్తులతో కలిసి పండుగల పోస్టర్ విడుదల చేశారు. ఇప్పటికే అన్ని మండలాల్లో ప్రచారం చేశామన్నారు. ఏడుగురు సువార్తీకులు వివిధ ప్రాంతాల నుంచి వాక్య పరిచర్య చేయడానికి విచ్చేస్తున్నారని తెలిపారు. భక్తులంతా హాజరై దేవుని ఆశీస్సులు పొందాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



కెరీర్ గైడెన్స్‌పై మాట్లాడుతున్న కిషోర్

గణపవరం(ఉంగుటూరు): విద్యార్థులు సమయపాలన పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ సూచించారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షత కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిషోర్ మాట్లాడుతూ రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. సబ్జెక్టులను సులభంగా అభ్యసించే విధానాలను వివరించారు. విద్యార్థులు సెల్ ఫోన్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రథమ సహాయకుడు శ్రీనివాస కుమార్, ఉపాధ్యాయులు కె.జాన్, జి.పోశియ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో ప్రమాదాలు

దెందులూరు: కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవిస్తునే ఉన్నాయని గుండుగొలను గ్రామ మాజీ ఉపసర్పంచ్, పట్టాభి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి కాశీబాబు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గుండుగొలను నుంచి దెందులూరు వచ్చే జాతీయ రహదారిపై సత్యనారాయణపురం సమీపంలో ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదాలకు నెలవుగా మారిందని తెలిపారు. హైవేపై గోతులను తూతూ మంత్రంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన పూడ్చించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి


పెదపాడు : రోడ్డు ప్రమాదాలు నివారణకు నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ వైఎస్వీ కళ్యాణి అన్నారు. పెదపాడు హైస్కూల్‌లో గురువారం ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మందకొడిగా రహదారి పనులు

- రాళ్లు లేచి నరకం చూస్తున్న ప్రయాణికులు
- త్వరితగతిన పూర్తి చేయాలంటున్న గ్రామస్తులు



పొక్లయిన్‌తో తవ్వుతున్న రోడ్డు



రహదారిపై లేచిన రాళ్లు

చింతలపూడి: నామవరం, పట్టాయగూడెం రహదారి నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. దశాబ్ధాల కాలంగా నామవరం వెళ్లే రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డు మొత్తం గుంతలు పడి, రాళ్లు లేచి ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ రహదారిలో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ఉండేవారు. ప్రతి రోజూ ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రత్యక్ష నరకం చూస్తున్నామని, రాత్రి వేళల్లో ప్రయాణమైతే నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు తిట్టని రోజు లేదు. ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో సుమారు పది గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆటోల్లోనూ లేదా కాలినడకన తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టహాసంగా రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కాని రోడ్డు నిర్మాణం మాత్రం చేపట్టలేదు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాబార్డు నుంచి సుమారు రూ.20 కోట్ల రుణం మంజూరు చేసింది. దీంతో రహదారి నిర్మాణానికి మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అప్పట్లో శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించే లోపు ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో పడింది. ఇటీవల ముచ్చటగా మూడోసారి టీడీపీ నాయకులు ఈ రహదారి నిర్మాణానికి మరోసారి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి నాలుగు నెలలు దాటిపోతున్నా రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. రోడ్డుకు ఇరు వైపులా జంగిల్ క్లియరెన్స్ చేశారు. రోడ్డును తవ్వేయడంతో రాళ్లు లేచి ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్లు బాగా లేకపోవడం వల్లనే తాము బస్సులు నడపలేక పోతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని, ఏలూరు, సత్తుపల్లి ఆర్టీసీ బస్సులు ఈ గ్రామాల మీదుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులు వేగవంతం చేయాలి



రోడ్డు నిర్మాణం పనులు వేగంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డును తవ్వేయడం వలన రాళ్లు లేచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలి.

-యర్రంశెట్టి రామకృష్ణారావు, మాజీ సర్పంచ్, నామవరం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో మండల నేతలు

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీ గోపాలపురం నియోజకవర్గ పలు అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల మండలానికి చెందిన ఏడుగురు నేతలకు పదవులు లభించాయి. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా ఐఎస్ రాఘవాపురానికి చెందిన దాకారపు బంగారమ్మ, బీసీ సెల్ అధ్యక్షుడిగా రాజుపాలేనికి చెందిన దొప్పసాని రాధాకృష్ణ, ఎస్టీ సెల్ అధక్షుడిగా పంగిడిగూడేనికి చెందిన లావూరి చినవెంకన్న, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా గుణ్ణంపల్లికి చెందిన బాలం వెంకటేశ్వరరావు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా సత్తాలకు చెందిన కేజీఆర్ (కొండాబత్తుల గిరి), ప్రచార విభాగం అధ్యక్షుడిగా గొల్లగూడేనికి చెందిన చిలకా నాగవెంకట సత్యదుర్గరాజు, ఇంటలెక్చువల్ ఫోరం విభాగం అధ్యక్షుడిగా రామన్నగూడేనికి చెందిన పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ హోంమంత్రి తానేటి వనితకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి



చింతలపూడి: గద్దె ఆచారి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు



వేలేరుపాడు: సమావేశంలో మాట్లాడుతున్న కారం దారయ్య

చింతలపూడి: గ్రామాలను అభివృద్ధి చేయాలని, గద్దె ఆచారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఎండపల్లి గ్రామశాఖ మహాసభ గురువారం కొండ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సభలో కామ్రేడ్ గద్దె ఆచారి 23వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ఆచారి విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ పతాకాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సీనియర్ నాయకులు బోడా వజ్రం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శాఖా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. గ్రామాల్లో డ్రైనేజీతో కూడిన సిమెంట్ రోడ్లు వేయాలని, సత్తుపల్లి వెళ్లే బస్సులు ఎండపల్లి అడ్డ రోడ్ నుంచి ఎండపల్లి ఊరి మీదుగా సత్తుపల్లి ప్రయాణం చేసే విధంగా బస్సు సర్వీసు నడపాలని కోరారు.కార్యక్రమంలో కంచర్ల గురవయ్య, పుల్లారు సోమశేఖర్, తొర్లపాటి బాబు, బోడ వజ్రం, దంతా కృష్ణ ,గంధం అంజమ్మ, అమ్ములు, చక్రబు బసవయ్య ఎస్కే లాల్‌బీ, ఒంగేటి పేతురు, తదితరులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు మద్దతు

వేలేరుపాడు: ఈ నెల 12వ తేదీన నిర్వహించే మన్యం బంద్‌కు గిరిజన సమైక్య సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఏపీ జీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య అన్నారు. గురువారం వేలేరుపాడు స్థానిక సీపీఐ కార్యాలయంలో పిట్టా ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారం దారయ్య మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంపై చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని, ఆదివాసీ గిరిజనులకు క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో ఆదివాసీలు ఏకమై కూటమి ప్రభుత్వంపై, సభాపతిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించి తగిన బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. శాసనసభలో ఈ విధంగా ప్రవర్తించడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో పిట్టా వీరయ్య, బంధం నాగేశ్వరరావు, కరాటం వెంకటేశ్వరరావు, మడివి కామయ్య, బంధం అర్జున్, కంగాల గంగరాజు, మడకం దుర్గారావు, తాటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత స్థానం



పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్

బుట్టాయగూడెం: మనిషి చదువుతోనే ఉన్నత స్థానానికి చేరుకోగలడని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పంకజ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజానగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ వివరాలను విదార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత ఐటీడీఏ పీఓ చాంబర్‌లో పీఓ కేతావతు రాములు నాయక్‌తో కలిసి ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈవో రామమోహన్‌రావు, ఏఎంఓ శిరమయ్య, పీఎంఆర్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు పరామర్శ



బాలరాజును పరామర్శించి మల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ హోంమంత్రి వనిత

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తల్లి మల్లమ్మ పెద్ద కార్యక్రమం గురువారం మండలంలోని దుద్దుకూరులో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ చింతలపూడి ఇన్‌చార్జి కంభం విజయరాజుతో పాటు జిల్లా నలుమూలల నుంచి పలువురు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాలరాజును పరామర్శించారు. అదే విధంగా మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అదే విధంగా బాలరాజు కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ మేరకు బాలరాజుకు ధైర్యం చెప్పారు. సాయి బాల పద్మ, గోపాలపురం నియోజకవర్గ నాయకులు ఖాదర్ వలి, ముల్లంగి శ్రీనివాస్, సాలి వేణు, శ్రీరామమూర్తి, మల్లిపూడి నాగమణి, షేక్ మస్తాన్ భాష, వివేక్, మాల్లిపూడి సలీం, షేక్ నభి, నాయకులు, కార్యకర్త లు, ప్రజలు, అభిమానులు, పెద్ద ఎత్తున వచ్చి బాలరాజును పరామర్శించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వం అర్హులలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ టి.సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి పేద కుటుంబానికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని లేనిచో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు ఆక్రమించి పేదలకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, వీరంకి వెంకట్రావు, పాదిల సుందరం, అబ్బుదాసరి సంజీవరావు, శిలారపు మద్ది రాముడు, కొమ్ము జక్రయ్య, పాదిల చిన దుర్గారావు, ఉప్పులూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నినాదాలు చేస్తున్న డక్కలి కులస్తులు

కొయ్యలగూడెం: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డక్కలి కులస్తుల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కర్ని శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రామానుజపురం గ్రామంలో డక్కలి కులస్తుల జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మన పిల్లల భవిష్యత్తు మారాలంటే దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రతన్ రంజన్ మిశ్రా కమిటీ అన్ని జిల్లాలను పర్యటించి, తమ సామాజిక వర్గం తరపున అన్ని జిల్లాల్లో రిప్రజెంటేషన్ అందించారన్నారు. అయితే, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో నిన్న ప్రవేశపెట్టిన తీర్మానంలో డక్కలి కులాన్ని ఏ-గ్రేడ్ వర్గంలో చేర్చి, కేవలం ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా తమకు అన్యాయం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇరవై వేల మందికి పైగా డక్కలి కులస్తులు ఉన్నారని, వీరు యాచక వృత్తి, పందులు, గాడిదల పెంపకం, ప్లాస్టిక్ అమ్మకం, తల వెంట్రుకల సేకరణ, ఆయుర్వేద వైద్యం వంటి పనులు చేస్తూ అట్టడుగున ఉండి అంటరాని జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. తమ ఉపకులాలను గుర్తించి, కనీసం నాలుగు నుంచి ఎనిమిది శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అదనంగా అధిక జనాభా కలిగి, అత్యంత అభివృద్ధి చెందిన కులాలను బీసీలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. జి.డానియేలు, కె.సుబ్బారావు, కె.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సర్వే ఫీవర్



వికలాంగుడికి పరీక్షలు చేస్తున్న వైద్యులు



దివ్యాంగుల వివరాలు సేకరిస్తున్న వైద్యులు

- 40 శాతంపైగా పింఛన్ల తొలగింపే లక్ష్యమా?
- కక్షగట్టిన కూటమి సర్కార్..ఆందోళనలో లబ్ధిదారులు

భీమడోలు: దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు కూటమి సర్కార్ సర్వం సిద్ధం చేసింది. 40 శాతం పైగా లబ్ధిదారులు అనర్హులని, వీరి పింఛన్లు తొలగించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించేందుకు ప్రత్యేక సర్వే సాకుతో వైద్య బృందాలను ఇళ్లకు పంపిస్తుంది. దీంతో ఏన్నో ఏళ్లుగా సదరం ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల గుండెల్లో గుబులు మొదలైంది. ఎన్నికల సమయంలో పింఛన్ల సొమ్ము పెంచుతామని చెప్పిన కూటమి నాయకులు నేడు అనర్హుల పేరుతో ఏరివేత చేపట్టడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రూ.15 వేలు తీసుకునే వారే టార్గెట్

మంచం పట్టిన, కుర్చీలకే పరిమితమైన వికలాంగులకు పింఛన్ సొమ్ము రూ.15 వేలకు పెంచారు. ఆరు నెలల పాటు పెంచిన సొమ్ము అందించిన కూటమి ప్రభుత్వం పింఛన్లలో అక్రమాలు జరిగాయని, బోగస్ పింఛన్లు ఏరివేయాలని లబ్ధిదారులకు షాకిచ్చింది. మంచానికే పరిమితమైన లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందం వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై నివేదికలను తయారు చేసి సంబంధిత వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. కన్ను, చెవి ఇతర సమస్యలు గల లబ్ధిదారులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపి అక్కడ పరీక్షలు చేయించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో లబ్ధిదారుల ఆరోగ్య పరీక్షల సర్వే పూర్తి చేశారు.

నేటికీ వితంతు పింఛన్ లేదే?

సాధారణంగా రేషన్ కార్డులోని భర్త వృద్ధాప్య పింఛన్ పొందుతూ మృతి చెందితే, భర్త డెత్ సర్టిఫికెట్ ఆధారంగా భార్యకు వెంటనే వితంతు పింఛన్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందేది. నేడు కూటమి సర్కార్ జూన్ నుంచి అక్టోబర్ వరకు చనిపోయిన వృద్ధులైన భర్తల పింఛనును వారి భార్యలకు ఇప్పటి వరకు ఇవ్వలేదు. నవంబర్‌లో మృతి చెందిన వారికే వితంతు పింఛన్ అందుతోంది. ఇది లబ్ధిదారుల చావుకు.. నెలలకు సంబంధమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

నిబంధనల మేరకే పరీక్షలు



గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని 41 మంది మంచానికే పరిమితమైన దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక వైద్యులు పరీక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారిని పరీక్షించారు. వీరి నివేదికలను జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాం. అర్హత గల లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, గుండుగొలను

నేడు లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం

కొయ్యలగూడెం: లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి ఆలయంలో ఉపాలయమైన స్వామివారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహిస్తామని భక్తులు హాజరు కావలసిందిగా కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

కొయ్యలగూడెం: రామానుజపురంలో ఎనిమిదో తేదీ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రామచంద్ర శంకర నేత్ర చికిత్సాలయ (జంగారెడ్డిగూడెం) నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. పంచాయతీ ఆఫీసు వద్ద నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిరంలో తలనొప్పికి, కంటి మసక, మెడ నరాలు లాగుట, కళ్ల నీరు కారటం, కళ్లు ఎరుపు మొదలగు వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందులు అందిస్తామని రోగులు అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. కంటికి ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తే ఉచితంగా జంగారెడ్డిగూడెం హాస్పటల్లో నిర్వహిస్తామన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

కామవరపుకోట: మోటార్ సైకిల్ దొంగతనం కేసులో చింతలపూడి మేజిస్ట్రేట్ చిన్న మధుబాబు ఇద్దరికి నాలుగు నెలల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధించినట్లు తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపారు. గణపవరం మండలం మోగల్లు గ్రామానికి చెందిన చెట్టి చిన్న, కోయిలగూడెం మండలం రామగుండం గ్రామానికి చెందిన చప్పిడి ముసలయ్య అనువారు తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో మోటార్ సైకిల్ దొంగతనం కేసులో నేరం రుజువైనందున శిక్ష విధించినట్లు తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలకు శిక్ష పడటానికి ప్రాసిక్యూషన్ తరపున జంగారెడ్డిగూడెం సీఐ వి.కృష్ణబాబు, తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు, తడికలపూడి కోర్ట్ కానిస్టేబుల్ డి.అనిల్ కుమార్ సహకరించారు.

భర్త, అత్తమామలపై కేసు

భీమడోలు: వరకట్న వేధింపులకు పాల్పడుతున్న భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు మండలం అంబర్‌పేటకు చెందిన సుష్మిత అనే మహిళకు ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడుకు చెందిన లక్కాబత్తుల నరేష్‌తో ఐదేళ్ల కితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. నరేష్ కొంత కాలంగా వేరొక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ.. అధనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడని, ఇందుకు అత్తమామలు సహకరిస్తున్నారని సుష్మిత పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

పెదవేగి : స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆకస్మిక తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పడిన పెదవేగి సర్కిల్‌కు కార్యాలయ నిర్మాణానికి స్థల సేకరణ నిమిత్తం సందర్శించినట్టు ఎస్పీ చెప్పారు. పోలీస్‌స్టేషన్‌ను కూడా పునర్నిర్మించే యోచనలో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా అమర్ శ్రీనివాస్



అమర్ శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): స్థానిక స్పెషల్ కోర్టు పర్ ట్రైల్ అఫ్ అఫెన్సెస్ అండర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏలూరుకు చెందిన న్యాయవాది వాసర్ల అమర్ శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు ఈ హోదాలో కొనసాగనున్నారు. శ్రీనివాస్ ఏలూరు సీఆర్ఆర్ కాలేజీలో లా పట్టా పొందారు. 1993 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. 2014 నుంచి 2017 వరకు ఏలూరు బార్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు న్యాయవాదులు ప్రశంసించి శుభాకాంక్షలు తెలిపారు.